కలగానే బీటీరోడ్డు

- కంపచెట్లతో మూసుకుపోయిన దారులు
- అడుగడుగున గోతులతో ప్రయాణ ఇబ్బందులు
- కనీసం మట్టి రోడ్డుకు నోచుకోని గ్రామాలు



కంకర తేలిన గోతుల జక్కన్నపల్లి రహదారి

నర్వ: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న లక్కర్‌దొడ్డి గ్రామానికి బీటీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏపుగా పెరిగిన ముళ్లకంపతో పాటు గోతులు పడ్డ రహదారితో కనీసం బైక్‌ల ప్రయాణానికి ఇబ్బందులేనని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంతోపాటు కొత్తపల్లి గ్రామం దశాబ్దాలుగా రహదారి సమస్యతో సతమతమవుతుంది. కొత్తపల్లి నుంచి పెద్దకడ్మూర్‌కి వెళ్లేందుకు ప్రజలు నిత్యం ప్రతి పనికి గతుకులరోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. ఈ రహదారికి కనీసం మట్టిరోడ్డుకు నోచుకోలేక ప్రయాణికులు గోతుల రహదారిపైనే ప్రయాణం చేస్తున్నామని వాపోతున్నారు. ఈ గ్రామానికి ఇటీవల ఎమ్మెల్యే తన సొంత నిధులతో గజ్జలమ్మ వాగుపై బ్రిడ్జీ నిర్మాణం చేసిన నేపథ్యంలో బీటీరహదారి ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీంతో పాటు మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గ్రామం జక్కన్నపల్లి రోడ్డు సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం ఈ గ్రామస్తులు మండల కేంద్రానికి రావల్సిందే. ఈ రోడ్డును బీటీచేయాలని గ్రామస్తులు వినతులు చేపట్టిన ఏ అధికారులు, పాలకులు గాని పట్టించుకునే పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

బీటీరోడ్డు ఏర్పాటు చేపట్టండి..



మా కొత్తపల్లి గ్రామానికి రావడానికి ప్రధాన అడ్డంకిగా మారిన వాగుపై బ్రిడ్జీ నిర్మాణం ఇటీవల ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఏర్పాటుచేశారు. గత కొన్ని రోజులుగా బీటీరోడ్డు లేక గతుకుల రోడ్డుపై నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. పెద్దకడ్మూర్ నుంచి మా గ్రామానికి 3కిలోమీటర్లు బీటీ రోడ్డుఏర్పాటు చేసి ప్రయాణ ఇబ్బందులు తొలగించాలి. – సుజాత సర్పంచ్, కొత్తపల్లి గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం..



నిత్యం లక్కర్‌దొడ్డి నుంచి సమీప గ్రామమైన నర్వకు ప్రతి పనికి వస్తుంటాం. ఉన్న రోడ్డు అడుగడుగున గోతులతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. కనీసం ఈ మార్గం గుండా ఆటోలు కూడా వెళ్లవు సొంత బైక్‌పైనా లేదా కాలినడకన మండలానికి వెళ్తా అవస్థలు పడుతున్నాం. కేవలం 2 కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాన్ని బీటీరోడ్డు మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. – శివన్న సర్పంచ్, లక్కర్‌దొడ్డి గ్రామం

మట్టిదారే దిక్కు..



మండల కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న జక్కన్నపల్లి గ్రామానికి కంకర తేలిన మట్టి రహదారే దిక్కు. ఈ మార్గం గుండానే బస్సు ప్రయాణం చేస్తున్నాం. అడుగడుగున గుంతలు కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామానికి బీటీ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలి.
–కోట్ల నాగిరెడ్డి, సర్పంచ్ జక్కన్నపల్లి గ్రామం

క్లుప్తంగా

నేడు సీతారామ మహారాజ్ జయంతి

నారాయణపేట రూరల్: పట్టణంలోని మోనప్పగుట్టలో సజీవ సమాధి పొందిన శ్రీ సీతారామ మహారాజ్ జయంతిని ఆదివారం నిర్వహిస్తున్నట్లు భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ సమీపంలోని మోనప్పగుట్టపై ఉదయం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వంతెన నిర్మించాలి



మాగనూర్: మండలంలోని తళంకేరి–నేరడగం దొడ్డి గ్రామస్తుల దారి కష్టాలు తీర్చేందుకు చిన్నవాగుపై నిర్మించిన సంవత్సరంలోపే వరదకుకొట్టుకు పోవడంతో రెండు గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో వర్షాకాలం వస్తేచాలు రెండు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయని వాపోతున్నారు. ఉన్నత చదువులకోసం వెళ్తున్న విద్యార్థులు వాగులో ఈతకొట్టుకుంటు పోవాల్సిన పరిస్థితి నేలకొందని, అత్యవసర సమయాల్లో ఇబ్బందిగా ఉందన్నారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకొచ్చిన స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిన్నవాగుపై నూతన వంతెన నిర్మిచేలా చర్యలు తీ సుకోవాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మూతపడ్డ తాగునీటి శుద్ధి కేంద్రం



నర్వ: మండల కేంద్రంలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థచే తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రం నిర్వాహణ లేక మూతపడింది. గతంలో కార్డు పెడితే తాగునీటిని అందించే ఈ కేంద్రం గత కొన్నిరోజులుగా నిర్వాహణ లేకపోవడంతో మూతపడిందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో గ్రామంలోని ప్రైవేట్ కేంద్రాల వద్ద తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. ఈ కేంద్రాన్ని నిర్వాహణ చేపడితే గ్రామ ప్రజల స్వచ్ఛమైన తాగునీటి అవసరాలు తీరుతాయని వారు కోరుతున్నారు. వెంటనే గ్రామ పంచాయతీ కాని దాత సహకారంతోనైనా ఈ కేంద్రాన్ని మరమ్మతు చేపట్టి తాగునీటి అవసరాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రహరీ లేక విద్యార్థుల ఇక్కట్లు



కంపౌండ్ వాల్‌కు నోచుకోని వసతి గృహం

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహానికి పూర్తిగా ప్రహరీని నిర్మించకపోవడంతో వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వసతి గృహానికి పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మించాల్సి ఉండగా నిధుల లేమితో కేవలం ఎల్ ఆకారంలో మాత్రమే నిర్మించి వదిలేశారు. దీంతో వసతి గృహ ఆవరణంలో పశువులు, మేకలు, గొర్రెలు చొరబడి నాటిన మొక్కలను నాశనం చేస్తున్నాయి. చుట్టుపక్కల పంట పొలాలు ఉండటంతో రాత్రి వేల విషపురుగులు సైతం వసతి గృహ వరండాలో సంచరిస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వసతి గృహానికి కంపౌండ్ వాల్ నిర్మించాలని కోరుతున్నారు.

రహదారులపై నూర్పిళ్లు

అమరచింత: వరికోతలు ఊపందుకున్న వేళ అమరచింత పట్టణంతో పాటు నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో రైతులు వరిధాన్యాన్ని ప్రధాన రహదారులపై ఆరబెడుతుండటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం పంట నూర్పిళ్ల కోసం సబ్సిడీలతో కల్లాలను నిర్మించి ఇస్తున్నామని చెబుతున్నా రైతులు మాత్రం పంటపొలాల్లో కల్లాల ఏర్పాటుకు సుముఖత చూపడం లేదు. అమరచింత నుంచి మద్దూరు, అమరచింత నుంచి అల్లీపురం, అమరచింత నుంచి నాగల్‌కడ్మూర్ గ్రామాల మీదుగా వెళ్తున్న ప్రయాణికులు రహదారి మలుపుల్లో రాత్రి వేళ ధాన్యం కుప్పల వద్ద రాళ్లను పేర్చి ఉంచడంతో వాహన చోదకులు వాటిని గమనించక అదుపు తప్పి వాహనాలను కింద పడేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాహదారులపై పంట నూర్పిళ్లు జరుగకుండా రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.



అమరచింత నుంచి మద్దూరు రహదారిపై ఆరబోసిన వరిధాన్యం

క్యాన్సర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేష్‌గౌడ్

మక్తల్: పట్టణంలోని శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్యాన్సర్‌వ్యాధిపై డాక్టర్. రాజేష్‌గౌడ్ అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్‌ఆఫ్ బీమా అధ్యక్షుడు అంబాదాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ప్రతి రెండు నిమిషాలకు ఒక బిడ్డకు క్యాన్సర్ లక్షణాలలో ప్రధానంగా అసాధరమైన గడ్డలు రక్తహీనత శక్తికోల్పోవడం అధిక జ్వరం తరుచుగా తలనొప్పి వాంతులు తదితర రోగ లక్షణాలు పిల్లల్లో ఎక్కువగా ఉంటుందన్నారు. క్యాన్సర్‌బారి నుంచి మనల్ని మనం రక్షించుకోవాలన్నారు. అందరు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి అంజన్‌ప్రసాద్, రీజినల్ చైర్మన్ రమేష్‌రావు, శ్రీనివాస్‌రావు, వెంకటేష్, ఆంజనేయులు కట్ట వెంకటేష్, దత్తురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర పాడుబావిని పూడ్చండి



అమరచింత: పట్టణ శివారులో మద్దూరుకు వెళ్లే రహదారిలో కొత్త తండా సమీపంలో ప్రమాదకర పాడుబావిని పూడ్చాలని తండా ప్రజలతో పాటు పట్టణవాసులు కోరుతున్నారు. రహదారికి ఇరువైపులా మలుపుల వద్ద పాడుబడ్డ పాడు బావులు ఉన్నాయని, దీంతో వాహనదారులు వేగంగా వాహనాలను నడుపుతూ మలుపుల వద్ద పాడుబావులను గమనించక అదుపు తప్పి గాయాల పాలవుతున్నారని తెలిపారు. రెండేళ్ల కిందట పాంరెడ్డిపల్లికి చెందిన యువకుడు తాగిన మైకంలో ద్విచక్ర వాహనంతో సహా పాడుబావిలో పడటంతో అక్కడే మృతి చెందినా.. వీటిని పూడ్చాలనే ఆలోచన అధికారులకు కలుగక పోవడం శోచనీయం అంటున్నారు. ఇప్పటికై నా పాడుబావులను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యువతి అదృశ్యం : కేసునమోదు

భూత్పూర్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంచంద్రయ్య శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన 19 ఏళ్ల యువతి తల్లిదండ్రులతో ఇంట్లోనే ఉండేది. పట్టణ సమీపంలో నూతనంగా ఇళ్లు నిర్మాణం చేసుకుంటున్న నేపథ్యంలో యువతి తల్లిదండ్రులు శనివారం అక్కడికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతి.. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కన్పించలేదు. చుట్టుపక్కలా, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా పట్టణంలోని ఓ చర్చిలో ఫాస్టర్‌గా పనిచేస్తున్న రవిపై అనుమానం ఉందని యువతి తండ్రి భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



సద్గురు అవదూత నర్సింహాస్వామి పల్లకిసేవా

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సద్గురు అవదూత నర్సింహాస్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం కాకడహారతి నిర్వహించి స్వామివారి మూల విరాట్‌కు రుద్రాభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాదుకపూజ, అఖండ దీప ప్రజ్వలన నిర్వహించి స్వామివారికి పుష్పాలతో అలంకరణ చేపట్టారు. పూజల అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పట్టణ పురవీధుల గుండా స్వామివారి ఉత్సవవిగ్రహాలతో పల్లకిసేవా నిర్వహించారు. రాత్రి మహిళలచే కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో స్వామి భక్తులు, శిశ్యబృందం పాల్గొన్నారు.

శ్రీహరి గెలుపునకు ఆలయంలో పూజలు

అమరచింత: మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అఖండ మెజారిటీతో గెలవాలని శనివారం అడవి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సింగంపేటలో వెలిసిన అడవి ఆంజనేయ స్వామి ఎంతో మహిమానితుడని, మొక్కులు తీర్చే దేవుడని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకుడు కొమరి రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని రాజావళి, మహబూబ్‌ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం బీఆర్ఎస్ కబంధ హస్తాల మధ్య అప్పుల తెలంగాణగా మారిందన్నారు. కాంగ్రెస్ బలపర్చిన మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి వాకిటి శ్రీహరి భారీ మెజారిటీతో గెలిస్తే ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డె శ్రీను, చిన్న ఆంజనేయులు, చిన్నకురుమన్న, పెద్దకురుమన్న, వెంకటేష్, అన్నమయ, బంగ్లారాములు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉత్సాహంగా వ్యాయామ విద్య దినోత్సవం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మక్తల్: వ్యాయామ విద్యా దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో సైక్లింగ్, షూటింగ్ బాల్, టగ్ ఆఫ్ వార్ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ పీఈటీ గోపాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాను పట్టుకుని పట్టణంలో తిరిగారు. విద్యార్థులు పీఈటీ రంగంలో ప్రతిభచాటి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీఈటీలు అంబ్రేష్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టు బోధనపై అవగాహన

కృష్ణా: మండలంలోని గుర్జాల్ ప్రాథమిక పాఠశాలలను శనివారం డీఆర్‌పీలు రాఘవేంద్ర, శ్రీకాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు తొలిమెట్టు పాఠ్యాంశాల బోధనతీరు, విద్యార్థులకు చదవడం, రాయడంతోపాటు పలు అంశాలను పరిశీలించారు. అదేవిధంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు వినోద్, దేవేంద్రమ్మ, సీఆర్‌పీ అమీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాయ్ రాజా కాయ్



- అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్
- చేతులు మారుతున్న రూ.లక్షలు
- ప్రధానంగా కొడంగల్, మహబూబ్‌నగర్, వనపర్తి నియోజకవర్గాలపై బెట్టింగ్
- రాష్ట్రంలో అధికారంలోకి రాబోయే పార్టీపై సైతం
- బెట్టింగ్ కోసం ప్రత్యేక యాప్‌లు!

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈనెల 3న పోటీలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలనుండగా..ఈ ఎన్నికల ఫలితాలపై కొందరు జోరుగా బెట్టింగ్ కడుతున్నారు. పందెం పేరిట ఒక్కొక్కరు రూ. లక్షల మేర ఖర్చు చేస్తున్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వ్యాపారులు, యువత తదితరులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గాలలో ఏపార్టీ అభ్యర్థి విజేతగా నిలుస్తాడు అనే అంశంపై బెట్టింగులు జోరందుకున్నాయి. ఎన్నికలు ముగియడం..పోలింగ్ శాతం పెరగడంతో అభ్యర్థుల గెలుపు, ఓటములు, మెజార్టీలపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రధానంగా మహబూబ్‌నగర్, కొడంగల్, వనపర్తి నియోజకవర్గాలతో పాటు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేపట్టబోతుందని అనే విషయంపై భారీగా బెట్టింగ్ వేస్తున్నట్లు సమాచారం. ప్రత్యేక యాప్‌లతో పాటు వ్యక్తులు ఒకరికి ఒకరు నేరుగా వేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

■ నవంబర్ 30న సాయంత్రం 5గంటలకు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ముగిసింది. అప్పటి నుంచి ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. మరోవైపు కొందరు ఎవరు నాయకుడు అవుతాడు అనే అంశంపై బెట్టింగ్ వేస్తున్నారు. ఇప్పటికే ఫలితాలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువరించినా..పార్టీల వారీగా ఉన్న కార్యకర్తలు, అభిమానులు ఎవరి ధీమాలో వారున్నారు. ఇదే సమయంలో బెట్టింగ్‌రాయుళ్లు రూ.లక్షలు గుమ్మరిస్తుండటం ఆశ్చర్యకరం.

అంతటా అదే చర్చ: పోలింగ్ ప్రక్రియ ముగియటంతో ఉమ్మడి జిల్లాలో ఏ పట్టణంలో అయినా..పల్లెలో అయినా ఎక్కడికి వెళ్లినా ఫలితాలపై అందరి దృష్టి మళ్లింది. ఉదయం వేళలో మైదానంలో రన్నింగ్ చేస్తున్న వారి దగ్గరి నుంచి సాయంత్రం టీ దుకాణాల దగ్గర ముచ్చట్లు పెట్టే వ్యక్తుల వరకు ప్రతి ఒక్కరు దీనిపై చర్చలు పెట్టారు. టీ కొట్లు, హోటల్స్, స్నాక్స్ దుకాణాలు, పని చేసే ప్రదేశాలు, వాకింగ్ మైదానాలు ఇలా ఎక్కడికి వెళ్లిన చూసినా ఫలితాలపైనే ఆసక్తికర చర్చలు నడుస్తున్నాయి. ఫలానా వ్యక్తి గెలువబోతున్నారని ఒకరంటే.. కాదు..కాదు ఇంకో వ్యక్తి గెలుస్తారంటూ వాదనలకు దిగుతుండడం గమనార్హం.

అయ్యప్ప స్వాములకు స్వాగతం

జడ్చర్ల టౌన్: పాదయాత్రగా శబరిమలై వెళ్లి వచ్చిన స్వాములకు శనివారం అయ్యప్ప దేవాలయంలో సేవాసమితి సభ్యులు స్వాగతం పలికారు. నవంబర్ 1న పట్టణంలోని అయ్యప్ప స్వాములు భరత్‌గౌడ్, అనీల్, ప్రదీప్, శ్రీకాంత్‌లు పాదయాత్రగా శబరిమలైకు వెళ్లారు. 30రోజుల పాటు 1170కి.మీ మేర పాదయాత్ర చేసి అయ్యప్పస్వామి దర్శనం చేసుకుని పట్టణానికి చేరుకున్నారని వివరించారు.

విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పుస్తకాలు(స్టడీమెటీరియల్) పంపిణీ చేశారు. స్టడీమెటీరియల్‌ను ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ కోరారు. క్లబ్ కార్యదర్శి రాఘవేందర్, నాయకుడు వసీం, ప్రధ్యానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ చెల్లించాలి

నారాయణపేట రూరల్ : శాసనసభ ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వహించిన మధ్యాహ్నభోజన కార్మికులు, జీపీ కార్మిక సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించాలని సీఐటీయూ నాయకులు బలరాం, వెంటకయ్య డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు అన్నిరకాలుగా సేవలను అందించారని గుర్తుచేశారు. వారి సేవలను గుర్తించాలని కోరారు.

సత్ఫలితాలిస్తున్న అల్పాహారం

ఆకలితో బడికి వచ్చే సమస్య తీరిందంటున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: గ్రామీణప్రాంత విద్యార్థుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రారంభించిన అల్పాహార పథకం మండలపరిధిలో సత్ఫలితాలను ఇస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లోని ఒక్కో పాఠశాలలో అక్టోబర్ 6న అట్టహాసంగా పథకం ప్రారంభం అయ్యింది. అందులో భాగంగానే మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మూడు హైస్కూల్‌లలో పథకం ప్రారంభించారు. మహబూబ్‌నగర్ మోడల్ బేసిక్ స్కూల్, దేవరకద్ర జెడ్పీహైస్కూల్, జడ్చర్ల నియోజకవర్గంలోని కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో పథకం కొనసాగుతోంది. కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో 270మంది విద్యను అభ్యసిస్తున్నారు. హైస్కూల్‌కు కోడ్గల్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలైన కుర్వపల్లి, మక్తపల్లి, గైరాన్‌తండా, కుర్వపల్లి తండా, లింగంపేట, లక్ష్మీనాయక్‌తండా, నల్లకుంటతండాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. వీరంతా ఆయా ప్రాంతాల నుంచి నడుచుకుంటూ రావాల్సి ఉంటుంది. ఈ ఇళ్లవద్ద ఉదయం 8.30గంటలకే బయలుదేరాల్సి వస్తుంది. దీనికితోడు చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయం ఆధారంగా, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. దీంతో పొద్దున్నే లేచి పొలం పనులకు వెళ్తుంటారు. ఈ కారణంగా ఇళ్లల్లో వంటచేసేవారు లేక విద్యార్థులు పస్తులు, అర్థాకలితోనే బడులకు రావాల్సి వచ్చేది. పస్తులుండటం, నడిచి రావటం వల్ల ప్రార్థన సమయంలో కొందరు విద్యార్థులు నిల్చునేందుకు వీలుకాక పక్కన కూర్చుండిపోతుంటారు. ఈ నేపథ్యంలోనే అక్షయ పాత్ర ద్వారా రోజుకో తరహా అంటే ఇడ్లీ, ఉప్మా, పొంగళి, పూరీ, కిచిడీలను అల్పాహారంగా పాఠశాలలో ఇస్తుండటంతో విద్యార్థులకు సమస్య తీరినట్టైంది. కోడ్గల్‌లో ఈ పథకం సత్ఫలితాలను ఇస్తుండడంతో ఇతర పాఠశాలల్లోనూ ప్రారంభించాలని ఆయా పాఠశాలల విద్యార్థులు కోరుతున్నారు. సాధారణ ఎన్నికల కారణంగా ఇతర పాఠశాలల్లో పథకం ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికలు ముగియటంతో ఎప్పుడెప్పుడు తమ పాఠశాలల్లో అల్పాహారం పెడతారా? మా సమస్య తీరుతుందా? అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.



అల్పాహారం తింటున్న విద్యార్థులు

తినకుండా వచ్చేవాడిని



ఉదయం ఎలాంటి ఆహారం లేకుండానే బడికి వచ్చేవాడిని. ఎందుకంటే ఇంటివద్ద అంతపొద్దుగాల వంట చేసేవారు కాదు. కొన్నిసార్లు రాత్రి మిగిలిన అన్నం తిని వస్తుంటాను. ఇపుడు పాఠశాలలో టిఫిన్ పెడుతుండటం వల్ల సమస్య తీరింది. ఇప్పుడు బడికి వచ్చి ఇక్కడే తింటున్నాను. –యం. వినోద్‌నాయక్, లక్ష్మన్‌నాయక్ తండా విద్యార్థి

ఇబ్బందులు తప్పాయి



పాఠశాలలో ఉదయం అల్పాహారం పెట్టడం నాలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉందంటే మాటల్లో చెప్పలేం. ఇంటికాడ చాలాసార్లు వంట ఆలస్యం అవుతుందని తినకుండా పరుగెత్తుకు వచ్చేవాళ్లం. నాతోపాటు చాలామంది విద్యార్థులు అలాగే వస్తుంటారు. కొన్నిసార్లు పాలుతాగి వచ్చేవాళ్లం. పొలం పనులకు వెళ్లే హడావుడిలో మావాళ్లు ఉంటుండడంతో అడగాలని ఉండదు. ఇక్కడ అల్పాహారం ఇస్తుండడంతో ఇబ్బందులు తొలిగాయి.
–అనూష, విద్యార్థిని, గైరాన్‌తండా

హాజరుశాతం పెరిగింది



గ్రామీణ ప్రాంతాలనుంచి విద్యార్థులు రావటం వల్ల ఇళ్ల వద్ద అంతపొద్దుగాల టిఫిన్ చేసేవారు కాదు. కొందరు విద్యార్థులైతే పాఠశాలకు వచ్చాక ప్రార్థన సమయంలో నిలబడే ఓపిక లేక అనుమతి తీసుకుని పక్కన కూర్చునే వారు. అల్పాహారం ప్రారంభం అయ్యాక ఆ ఇబ్బంది లేకుండా పోయింది. అల్పాహారం వల్ల విద్యార్థుల హాజరు శాతం సైతం పెరిగింది. తరగతి గదిలోనూ ఉత్సాహంగా ఉండగలుగుతున్నారు. –శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు, కోడ్గల్, జెడ్పీహైస్కూల్